క్లుప్తంగా

పారదర్శకంగా ఆయాల ఎంపిక



అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న సీడీపీఓ ఉష

పెద్దాపురం: సబ్ డివిజన్ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా వర్కర్ల పోస్టుల నియామక ఎంపికను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు సీడీపీఓ జి.ఉష అన్నారు. స్థానిక పెద్దాపురం ప్రాజెక్టు పరిధిలోని ఆయా పోస్టుల నియామకాలకు సంబంధించి ఎంపికైన అభ్యర్థులకు శనివారం ఆమె నియామక పత్రాలను అందజేశారు. అడిషనల్ సీడీపీఓ పద్మావతి, యూడీసీ బత్తుల మూర్తి తదితరులున్నారు.

31న కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం 31వ తేదీన నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ అభివృద్ధి పనులపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి 44 అంశాలతో అజెండా తయారుచేసినట్టు తెలిపారు. వీటిపై చర్చించేందుకు అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. ఈ కౌన్సిల్ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షత వహిస్తారని తెలిపారు.

వేసవిలో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెక్టార్ సూపర్‌వైజర్ అరుణ

కొత్తపల్లి: వేసవిలో చిన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మూలపేట సెక్టార్ సూపర్ వైజర్ అరుణ అన్నారు. పొన్నాడ శివారు శ్రీలంవారి పాలెంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రం ఉదయం 8.30 గంటలకు తెరువాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిలో పిల్లలు బయట తిరుగకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్నం 12 గంటల వరకూ ఉండేలా చర్యలు చేపట్టాన్నారు. ఆట పాటలతో కూడిన విద్యను అందించాలన్ని సూచించారు. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని తెలిపారు. మూడు ఏళ్లు దాటిన పిల్లలను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాలల్లో చేర్చు కోవాలని ఆదేశించారు.

తాగునీటి నాణ్యత పరిశీలన



సామర్లకోట ఫిల్టర్ బెడ్ వద్ద తాగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్ అహ్మద్

సామర్లకోట: నాగార్జున ఫిల్టర్ చెరువులో నీటి మట్టం తగ్గిపోవడంతో ఆకుపచ్చ రంగులో తాగునీరు వస్తోందన్న ఫిర్యాదుల మేరకు మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్ శనివారం ఫిల్టర్ బెడ్ వద్ద తాగునీటిని పరిశీలించారు. క్లోరిన్, ఆలమ్ శాతాన్ని పరిశీలించారు. కుళాయిల నుంచి వచ్చే నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బందితో పాటు ఫిల్టర్ ప్లాంటును పరిశీలిస్తున్నట్టు చెప్పారు. చెరువులో నీటిమట్టం తగ్గిపోవడం వల్ల ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు.

యోగి వేమన వర్సిటీ అథ్లెటిక్స్ కోచ్‌గా ప్రవీణ్

నాగమల్లితోట జంక్షన్: యోగి వేమన వర్సిటీ అథ్లెటిక్ జట్టుకు కోచ్‌గా కాకినాడ డీఎస్‌ఏ అథ్లెటిక్స్ కోచ్ ప్రవీణ్ ఎంపికయ్యారు. సోమవారం నుంచి 31వ తేదీ వరకు యూపీలో జరిగే ఖేలో ఇండియా–2022 పోటీలలో పాల్గొనే జట్టుతో ప్రవీణ్ హాజరుకానున్నారు. ప్రవీణ్ వద్ద శిక్షణ పొందుతున్న షేక్ మొహియుద్దీన్ హైజంప్ విభాగంలో ఈ పోటీల్లో యోగి వేమన వర్సిటీ తరఫున పాల్గొంటున్నాడు.

జేఎన్‌టీయూకే అభివృద్ధిలో అప్పారావు పాత్ర కీలకం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే అభివృద్ధిలో వర్సిటీ తొలి వీసీ డాక్టర్ అల్లం అప్పారావు పాత్ర ఎనలేనిదని వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. ఇటీవలే అమెరికాలో మృతి చెందిన అల్లం అప్పారావు సంతాపసభ శనివారం వర్సిటీలో నిర్వహించారు. ప్రొఫెసర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి ప్రతిష్టాత్మకమైన ఆంధ్రా యూనివర్సిటీ సీఎస్ఈ విభాగాధిపతిగా, ప్రిన్సిపాల్‌గా కీలక బాధ్యతలు నిర్వహించి జేఎన్‌టీయూకే మొదటి వీసీగా నియమితులై నూతన సంస్కరణలు చేపట్టారన్నారు. ఆయనకు నివాళులర్పించిన వారిలో రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సుమలత, డైరెక్టర్లు, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇక ఆగాల్సిన పని లేదు..!

- చురుగ్గా ఆర్‌యూబీల నిర్మాణాలు
- తీరనున్న ప్రధాన రేల్వేగేట్ల సమస్య



గోర్స రైల్వే గేటు వద్ద చివరి దశకు చేరుకున్న ఆర్‌యూబీ నిర్మాణ పనులు

పిఠాపురం: రైల్వే గేట్ల వద్ద గంటల తరబడి పడిగాపులు పడాల్సిన అవసరంలేదు. ఆర్‌యూబీల నిర్మాణంతో ప్రయాణికుల పాట్లకు తెర పడింది. దక్షిణ మధ్య రేల్వేలో తుని, పిఠాపురంల మధ్య తుని సమీపంలో ఎల్ఐసీ కార్యాలయం వద్ద, పిఠాపురంలో గోర్స, మాధవపురం మూడు ప్రధాన రేల్వే గేట్లు వాటి ద్వారా సుమారు 50 గ్రామాలకు చెందిన ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. గేటు వేశారంటే వందల వాహనాలు గంటల తరబడి బారులు తీరుతుంటాయి. ఇది ఎన్నో ఏళ్లుగా వేలాది మంది ప్రయాణికులు పడుతున్న యాతన. ఈ విషయాలను గత ఎన్నికల ప్రచారాల్లో వైఎస్సార్ సీపీ నాయకుల వద్ద పలువురు గోడు వెళ్లబుచ్చుకున్నారు. దీంతో అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్య పరిష్కరిస్తామంటూ నాయకులు మాట ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర మంత్రి దాడిశెట్టి రాజా, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఈ సమస్యను కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె ఈ సమస్యలను రేల్వే శాఖ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వెంటనే చర్యలు తీసుకునేలా ఒత్తిడి తెచ్చారు. కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే మూడు ప్రధాన రేల్వే గేట్ల సమస్యకు పరిష్కారమైంది.

ప్రయాణికుల పాట్లకు చెక్

తుని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న రేల్వే గేటు తుని పరిసర గ్రామాల ప్రయాణికుల రాకపోకలకు ప్రధాన రహదారి. తలుపులమ్మ లోవ దేవస్థానానికి వెళ్లే భక్తులకు కూడా ఇది దారి. తుని పట్టణానికి చేరుకోడానికి ఈ రేల్వే గేటు దాటి వెళ్లాల్సి ఉంటుంది. ఈ మార్గంలో నిత్యం వేలాది మంది వాహనాలలో రాకపోకలు సాగిస్తుంటారు. వారంతా ఈ గేటు దాటి వెళ్లాల్సి ఉంది. రైల్వే గేటు గంటల తరబడి వేసి ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా ఈ గేటు వద్ద రేల్వే అండర్ బ్రిడ్జి ఆర్‌యూబీ నిర్మాణానికి రూ.5.45 కోట్లు నిధులు మంజూరు చేశారు. పిఠాపురంలో మాధవపురం రేల్వే గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి రూ.5.26 కోట్లు మంజూరయ్యాయి. వెంటనే పనులు ప్రారంభించిన అధికారులు సకాలంలో పూర్తి చేసి వాడుకలోకి తీసుకువచ్చారు. దీంతో ప్రధాన సమస్యకు పరిష్కారం లభించింది. గోర్స రైల్వే గేటు వద్ద నిర్మాణం పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే దీనిని ఆచరణలోకి తీసుకురానున్నారు. వీటితో పాటు ఉప్పాడ రైల్వే గేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటుండడంతో త్వరలో ప్రయాణికుల వెతలు తీరనున్నాయి.

వేగంగా నిర్మాణాలు



మూడు ఆర్‌యూబీల నిర్మాణం అధికారులు వేగవంతం చేశారు. ఇప్పటికే గోర్స రేల్వే గేటు వద్ద రూ.5.20 కోట్లతో చేపట్టిన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. మాధవపురం ఆర్‌యూబీ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించాం. దీంతో ఏళ్ల తరబడి ఉన్న ప్రయాణికుల సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. పిఠాపురం ఉప్పాడ రేల్వే గేటు ప్రధాన రహదారిలో ఉండడంతో ఇక్కడ రేల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ వంగా గీత దానిపై దృష్టి సారించారు.

– రావుల మాధవరావు, జెడ్ఆర్‌యూసీసీ మెంబరు, పిఠాపురం

వినియోగంలోకి వచ్చేలా..



ఆర్‌యూబీల నిర్మాణాలు వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. రేల్వే శాఖ ఉన్నతాధికారులతో సంప్రదించి నిధులు త్వరితగతిన రప్పించడంతో వీటి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయిన గోర్స ఆర్‌యూబీ త్వరలో ప్రారంభిస్తాం. ఉప్పాడ రేల్వే గేటు వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాం. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కాకినాడ పార్లమెంటు పరిధిలో రేల్వే గేట్లు వద్ద ప్రధాన సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు చేపట్టాం.

– వంగా గీతావిశ్వనాథ్, ఎంపీ, కాకినాడ

'పాల వెల్లువ'పై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీడీఓ, తహసీల్దార్లు

సామర్లకోట: జగనన్న పాల వెల్లువకు సంబంధించి ఎంపీడీఓ డి.శ్రీలలిత శనివారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో తన కార్యాలయంలో సమీక్షించారు. తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఉపాధిహామీ ఏపీఓ ప్రభాకరరావు, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

పాలవెల్లువపై అవగాహన

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పాలవెల్లువ కార్యక్రమంపై ఎంపీడీవో అబ్రహాంలింకన్ పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, వటర్నరీ అసిస్టెంట్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల నుంచి పాలను అమూల్ డెయిరీ కొనుగోలు చేసేలా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. గ్రామ సచివాలయాలకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, వటర్నరీ అసిస్టెంట్లు గ్రామాల్లోని వలంటీర్లతో సర్వే చేయించాలన్నారు. ఎంత మంది పాడి రైతులు ఉన్నారు? పశువుల సంఖ్యతో పాటు పాల ఉత్పత్తిని కూడా అంచనా వేయాలన్నారు. పాడి రైతులతో గ్రామాల్లో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, విస్తరణ అధికారి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమం సాధ్యం



లబ్ధిదారుతో మాట్లాడుతున్న దొరబాబు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు
- 22వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం

పెద్దాపురం : పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా గురువారం శంకరయ్యపేట 12వ సచివాలయం పరిధిలో 22వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, సచివాలయ గృహసారథుల మండల కన్వీనర్ గోపు మురళి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికీ సందర్శించారు. లబ్ధిదారులకు అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రవి, రఫీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేరుగా ఇంటికి చేరుతున్న పథకాలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



జగ్గయ్య చెరువులో స్థానికులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు, స్థానిక నాయకులు

పిఠాపురం: గతంలో ఏ పని జరగాలన్నా కాళ్లరిగేలా ప్రభుత్వ కార్యాలయాలు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకున్నవారుకాదని, ఈ ప్రభుత్వంలో పథకాలు వలంటీర్ల ద్వారా నేరుగా ఇంటికి చేరుతున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. శనివారం పిఠాపురం 21వ వార్డు జగ్గయ్య చెరువు కాలనీలో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలు అన్ని అందుతున్నాయా అంటూ ప్రజలను పలకరించారు. ఆ పథకాల వల్ల వారు పొందిన లబ్ధిని వివరించారు. తమకు నవరత్నాల పథకాలు అందుతున్నాయంటు వార్డు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగు నింప లేదని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టాకా మా తల రాతలే మారిపోయాయంటు ఎమ్మెల్యే వద్ద పలువురు మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వార్డులో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఒక్కరి పథకాలు వర్తింపజేస్తోందన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేక టీడీపీ నేతలు తప్పుడు ప్రచారాలు, ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత గల ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకం అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, బాలిపల్లి రాంబాబు, ఉలవల భూషణం, కౌన్సిలర్లు కావాడ పూసయ్య, చింతాడ నీలవేణి, బండి రవి, పాదగయ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుని దర్శనానికి బారులు తీరిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అర్చకుడు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామికి తులసి మాల అలంకరించి, భక్తులకు ఆశీర్వచనం అందించారు. వివిధ మార్గాల ద్వారా శనివారం ఒక్కరోజు సుమారు రూ.3,27,436 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు.

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ అమ్మవారికి శనివారం బంగారు, వెండి పుష్పాలతో మఖ నక్షత్ర పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మరిడమ్మ తల్లి జాతరకు పందిరి రాట వేస్తున్న పండితులు

అమ్మవారి జాతరకు పందిరి రాట మూహూర్తం

ఏటా ఆషాఢమాసంలో నిర్వహించే మరిడమ్మతల్లి జాతరకు శనివారం పందిరి రాట ముహూర్తం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.వి.రామ్మోహనరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి గరగ ఉత్సవం నిర్వహించారు. వచ్చే నెల 17 నుంచి ఆగస్టు 24 వరకు అమ్మవారి జాతర ఉంటుందన్నారు.

ప్రభుత్వానికి ప్రజలకు వారధులు వలంటీర్లు

సామర్లకోట: ప్రజలకు ప్రభుత్వానికి వలంటీర్లు వారధిగా పనిచేస్తున్నారని వారి సేవలను మరింత విస్తృతం చేయాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. మండల పరిధి వీకే రాయపురంలో వలంటీర్లకు «జగనన్న పాల వెల్లువ» శిక్షణలో ఆమె పాల్గొన్నారు. రైతుల నుంచి ప్రభుత్వం పాల సేకరణకు నిర్ణయించిందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం వైఎస్సార్ చేయూత, జగనన్న ఆసరా పథకాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి గేదెలు కొనుగోలు చేయడానికి సహకరిస్తున్నట్టు తెలిపారు. వీరి నుంచి అమ్యూల్ డెయిరీకి పాలు సేకరించి లాభసాటి ధర చెల్లిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు వలంటీర్లు గ్రామాల్లో మహిళలను చైతన్యపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వై.శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.



వలంటీర్ల శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలలిత

ఉత్సాహంగా వేళంగి క్రికెట్ టోర్నీ



వేళంగిలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న కార్యదర్శి చక్రపాణి

కరప: మండలం వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నీలో శనివారం ఐదు మాచ్‌లు జరిగాయి. నో ఏజ్ లిమిట్ విభాగంలో నాలుగు మ్యాచ్‌లు మొదటిమ్యాచ్‌లో చినకొత్తూరు జట్టుపై పాతర్లగడ్డ జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా సుదీర్ (పాతర్లగడ్డ) నిలిచాడు. రెండో మ్యాచ్‌లో పందలపాకజట్టుపై పేపకాయలపాలెం జట్టు గెలవగా వరప్రసాద్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించాడు. మూడో మ్యాచ్‌లో మాలపాడు జట్టుపై చొల్లంగిపేట జట్టు గెలిచింది. సుభాష్(మాలపాడు) మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా సాధించాడు. నాలుగోమ్యాచ్‌లో విజయరాయుడుపాలెం జట్టుపై పెనుగుదురు జట్టు గెలిచింది. రోహిత్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించాడు. అండర్–19 విభాగంలో జగన్నాథగిరి జట్టుపై భావారం గెలవగా, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా బన్నీ నిలిచాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను తూరంగి గ్రామ కార్యదర్శి ముమ్మిడి చక్రపాణి, గ్రాడ్యుయేట్ యూత్ ప్రతినిధులతో కలసి అందజేశారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

పిఠాపురం: స్థానిక 216 జాతీయ రహదారి పక్కన శనివారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైనట్టే పిఠాపురం పట్టణ ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా అక్కడ దొరికిన ఆధారాలను బట్టి అనుమానిస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అయితే నిడదవోలు మండలం సమిశ్రగూడెంకు చెందిన షేక్ హైదర్ అనే వ్యక్తి గత ఏప్రిల్ నెలలో కనిపించకుండా పోయినట్లు అప్పట్లో నిడదవోలు పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. పిఠాపురంలో లభ్యమైన మృతదేహం అతనిదే అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ విషయాన్ని నిడదవోలు పోలీసుల ద్వారా హైదర్ కుటుంబ సభ్యులకు తెలియజేశామని వారు వచ్చి నిర్ధారించాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

నగర పరిధిలో సమగ్ర సర్వే చేయండి

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న నివాసాలు, కుటుంబాలు, వ్యాపార సంస్థలకు సమగ్ర సర్వే చేపట్టాలని కమిషనర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం స్మార్ట్ సిటీ కార్యాలయంలో ఆయన స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 15 రోజుల వ్యవధిలో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ప్రతి సచివాలయ పరిధిలో ఎన్ని ఇళ్లు, ఎన్ని కుటుంబాలు, ఎన్ని వ్యాపార సముదాయాలు ఉన్నాయి? సదరు నివాసం అసెస్మెంట్ పరిధిలో ఉందా? లేదా? యూజర్ చార్జీలు చెల్లిస్తున్నారా లేదా వంటి సమాచారంతో సర్వే చేయాలన్నారు. నోడల్ అధికారులు స్వయంగా ఈ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. నిర్ణీత పద్ధతిలో సర్వేను పూర్తి చేయాలని సూచించారు. ఏడీసీ సిహెచ్ నాగనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర వైద్యంతో ప్రాణానికి రక్షణ

బోట్‌క్లబ్: గుండెపోటుతో పాటు, పక్షపాతం వంటి అత్యవసర పరిస్థితుల్లో రోగికి ప్రాథమిక చికిత్స సకాలంలో అందిస్తే బతికే అవకాశాలు చాలా ఎక్కువని ప్రముఖ కార్డియాలజిస్ట్ ఎంఆర్ఎన్ మహేష్ అన్నారు. శనివారం అపోలో ఆసుపత్రిలో వరల్డ్ ఎమెర్జెన్సీ మెడిసిన్ డే నిర్వహించారు. గుండెపోటు వచ్చినప్పుడు ఛాతి దగ్గర నొప్పితో, ఆయాసంతో బాధపడతారని అటువంటి లక్షణాలు కనపడిన వెంటనే మంచి సదుపాయాలు ఉన్న ఆసుపత్రికి తరలించాలన్నారు. సమయం వృధా అయ్యే కొద్ది గుండెపోటు ప్రాణాంతకం అవుతుందన్నారు. న్యూరో ఫిజిషియన్ శివరామగాంధీ, డాక్టర్ భువనాంజలి అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో అపోలో ఆసుపత్రి యూనిట్ సీఈఓ ఐవీ రమణ పాల్గొన్నారు.

విజ్ఞానం, వినోదాలే లక్ష్యంగా వేసవి శిబిరం



గ్రంథాలయంలో నిర్వహిస్తున్న క్విజ్‌లో పాల్గొన్న విద్యార్థులు

పెద్దాపురం: విజ్ఞానం వినోదంతో వేసవి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని బాలల గీతాలు, మిమిక్రీ ఉపాధ్యాయులు సూరి బలరామకృష్ణ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. శిబిరం కన్వీనర్ రొంగల అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బలరామకృష్ణ మాట్లాడుతూ విజ్ఞానం పుస్తకాలతోనే రాదని, సమాజంలో జరుగుతున్న ప్రతి కదలికను మనం తెలుసుకున్నప్పుడే అది సాధ్యపడుతుందన్నారు. యూటీఎఫ్ నాయకురాలు మిరియాల జయశ్రీ మాట్లాడుతూ పాటలు ఎలా పాడాలో, కథలు ఎలా చెప్పాలో విద్యార్థులకు ఆయా అంశాలపై సూచనలు, సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో బుద్ధా శ్రీనివాస్, కరాటే టీచర్ దుంగల పూజిత, సూర్యశ్రీ, కూనిరెడ్డి అరుణ, రవికుమార్, అమృత, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో..

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో శనివారం జగ్గంపేటకు చెందిన లండా రాజు విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ క్విజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 30 మంది విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి విద్యార్థులు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గవర్నర్ పర్యటనపై బందోబస్తు పరిశీలన

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడలో ఈ నెల 31న నిర్వహించనున్న జేఎన్‌టీయూకే స్నాతకోత్సవానికి కులపతి హోదాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ పర్యటనకు సంబంధించి బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శనివారం పరిశీలించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి వర్సిటీ ఆవరణలోని అతిథి గృహం,స్నాతకోత్సవం నిర్వహించే ఆడిటోరియం తదితర ప్రాంతాలన్నీ పరిశీలించారు. గవర్నర్ భద్రతకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వర్సిటీ అధికారులకు సూచనలు చేశారు.వ ర్సిటీ రెక్టార్ రమణ,రిజిస్ట్రార్ సుమలతలు వేడుకలు నిర్వహించే ప్రాంతం,గవర్నర్ షెడ్యూల్ తదితర వాటిని వివరించారు.



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

దిశ ఎస్‌ఓఎస్‌కు ఫిర్యాదుతో యువకుడి పరార్

కాకినాడ రూరల్: ప్రేమ పేరిట వేధింపులతో పాటు, ఆ యువతి ఇంటికి వెళ్లి దుర్భాషలాడడమే కాక, అడ్డువచ్చిన తండ్రిని గాయపరిచిన యువకుడు ఒక్క దిశ ఎస్ఓఎస్ కాల్‌కు పరారయ్యాడు. ఈ సంఘటన సర్పవరం పోస్టల్ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. దిశ టీం పోలీసులు తెలిపిన వివరాల మేరకు సర్పవరం గ్రామానికి చెందిన వీరబాబు అనే యువకుడు కొన్ని రోజులుగా పోస్టల్ కాలనీకి చెందిన యువతి వెంట పడుతూ ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఆమె ఇంటికి వెళ్లి అతిగా ప్రవర్తించి ఆమె తండ్రిని గాయపరిచాడు. దీంతో సదరు యువతి దిశ ఎస్ఓఎస్‌కు కాల్ చేసింది. వెంటనే అలర్ట్ అయిన దిశ టీమ్‌కు చెందిన కానిస్టేబుల్, హోమ్ గార్డులు ఐదు నిమిషాల వ్యవధిలో బాధితురాలి లొకేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు రాకను కనిపెట్టిన వీరబాబు పారిపోవడంతో బాధిత యువతి ఊపిరిపీల్చుకుంది. ఆమె ఫిర్యాదు మేరకు నిందితుడు వీరబాబుపై కఠిన చర్యలు తీసుకుంటామని దిశ పోలీసులు తెలిపారు.